# పెద్దకోడలు

రచన:

కొలిపు వీరభద్రుడు

ప్రచురణకు స్వీకరించిన
పోటీ కథానిక

"చిన్న కోడ లెంచక్కని కొడుకుని కన్నది! చూడ ముచ్చటొస్తుందండీ! దుబ్బులా ఉన్నాడు." పెద్దకోడలు భర్త సత్యమూర్తితో అంది.

"వాడు పుట్టిన జాతకాన్నయినా ఇబ్బంది లేకుండా వాళ్ళకింత జరిగితే వాడదృష్ట వంతుడే" దరిద్రంతో బాధపడుతున్న తమ్ముడు నారాయణరావుమీద సానుభూతి చూపించేడు హాయిగా కాలక్షేపం చేస్తున్న అన్న సత్యమూర్తి.

"ఆఁ వాళ్లా! యీ పుట్టెడు దరిద్రంతోనా? వాళ్ళ పొట్టకే ఎక్కడలేంటీ చాల కుండా వుంది పిల్లాడ్ని పెంచడ మొక్కటే!" సన్నగ నవ్వింది.

"తనకు భగవంతుడిచ్చేడు కాద"న్న విచారము. "వాళ్ళకి మాత్రం వాడు దక్కుతాడా!" అనే సంతోషము. "మనకే లేనిది వాళ్ళకి వుంటుందా!" అనే సమ భావంలో సమసిపోయిన ఈర్ష్య - నవ్వుతూ తానాడిన ఆ మాటల్లో యిమడ్చగలిగేనని పెద్దకోడలు మురిసిపోతున్నది.

"అవును. ఈ దరిద్రంతో వాళ్లు వాడిని దక్కించుకోలేకపోతే...." సత్యమూర్తి మరి ఆలోచించలేకపోయేడు. అతని ముఖమ్మీద విషాద మలముకొన్నది. భార్య ముఖమ్ముందు దాన్ని కనబరచ కుండా ఉందామని ప్రయత్నిస్తున్నాడు.

"అవునండీ- మరిది డాబాకొట్టు నమ్మే స్తాట్ట మనమే చేజిక్కించుకొంటే." భర్తగారి పరిస్థితిని గమనించని పెద్దకోడలు ఉత్సాహంగా అంది.

వద్దని యింతకుముందు అన్నాం" "ఏం, అంతేగదూ" అన్నట్టు భార్యని చూసేడు సత్యమూర్తి.

నారాయణరావుకి చేతిలో పైసాకూడ ఆడటంలేదు భార్యకి - చిన్నకోడలికి పురిటిరోజులు దగ్గరపడుతున్నవి కలువులో అధికమాసంలా వచ్చింది పేదరికంలో ఆ పురుడు. డాబా కొట్టుమీద ఋణం చెయ్యాలని నారాయణరావు నిశ్చయించేడు. "అయ్యో! ఎంత దుస్థితి కొచ్చేడు" అని సత్యమూర్తికి తమ్ముడిమీద సానుభూతి కలిగింది. లోలోపల బాధపడటం తప్పించి ఏమీ సహాయం చెయ్యలేకపోయేడు. భార్యముందు ఏమీ అనలేక మెదలకుండా కూర్చున్నాడు. ఆ ఋణమేదో తామే యివ్వాలన్న సంకల్పం నలుగురు ఆడపిల్లల తల్లి- ఆ పెద్దకోడలికి కలిగింది. వెంటనే "లోకులేమను కొంటారో" అన్న అనుమానం అద్భుతగలగా ఆ అభిప్రాయాన్ని మార్చుకుంది. "అసలిప్పటికే డబ్బు దాచేసి వాటాలు వెయ్యడంలో వాళ్ళని మనం మోసం చేసేమని మన మీద పడి ఏడుస్తుంటే డాబా మనం తాకట్టు వుంచుకోవడ మేమిటండీ! వీళ్ళకింత డబ్బు ఎలా వచ్చిందని అనుమానం కట్టరటండీ పోనిద్దురూ మనకేటీ వద్దు" సత్యమూర్తి తనఖామీద డబ్బివ్వడానికి సిద్ధంగా ఉన్నట్టూ, తాను "వదిని చెబుతున్నట్టూ- పెద్దకోడలు భర్తగారిని వారించిందానాడు.

ఈనాడు ఆ డాబాను అమ్మివేయడానికి నారాయణరావు సిద్ధంగా ఉన్నాడు. ఇంకొకరు డాబా కొనడం పెద్ద కోడలికిష్టంలేదు. అందుకే "మనమే చేజిక్కించుకొంటే" అని సత్యమూర్తితో అంది.

"మన డాబా యింకెవళ్ళో కొనడ మేఁవిటి! వంశానికే మచ్చ" అంది. కొద్దిగా గొంతు తగ్గించి మళ్ళీ అంది-" ఇలా అనే మనమనాలండీ. అలాగయితే "పై వాళ్ళకి అమ్మేసి అప్రతిష్ఠపాలవ కుండా సత్యమూర్తేకొని వంశమర్యాద నిలబెట్టెడురా" అని లోకులనుకొంటారు. మనమీద ఎవరికీ ఏ అనుమానమూరాదు." సత్యమూర్తిని ఒప్పించడానికి పెద్దకోడలు వేసుకున్న పథకమిది. సత్యమూర్తి మౌనాన్ని వహించేడు.

"చూసేదూ.... నా నగలు తాకట్టుపెడితే ఎవళ్ళకీ ఏ అనుమానమూరాదు, ఆ తరువాత వస్తువులు విడిపించుకోవచ్చు. అయితే ఒక సంగతి.... మనం కొంటున్నట్టుండగూడదు. ఇంకొకళ్ళచేత బేరమాడిపించాలి " పెద్దకోడలు సత్యమూర్తిని ఒప్పించింది.

భార్య ప్రోద్బలంతో డాబా తనఖా వుంచుకొన్న ప్వేమనిషిచేతనే డాబాను కొనిపించినట్టుచేసి, దాన్ని తనే తీసుకొని ఖాదీ వస్త్రాలయంగా మార్చేసేడు సత్యమూర్తి.

"తమ్ముడు దరిద్రంతో బాధపడుతూ కొట్టు నమ్మేస్తుంటే అన్నగారే దాన్ని కొన్నాడు. ఓహోహో కాలం! ప్చ్ప్చ్!"

"వంపకాలు వెయ్యడంలో నారాయణరావుని మోసపుచ్చకపోతే యింత డబ్బు సత్యమూర్తి కెలా వచ్చింది?"

"ఒకే తండ్రి పిల్లల్లో ఎంత ద్వేషం! లోకంలో యీనాడు ఒకళ్ళనొకళ్ళు కబళించడానికే చూస్తున్నారు బాబూ!"

"సత్యానిదేముందిరా! ఆ పెళ్ళాం వుంది చూడూ.... దాని ముందువాడు పిల్లి కూన. అది ఆడింది ఆట పాడింది పాటగా వుంది. నారాయణమీద సత్యా

నికే ద్వేషమూలేదు. గ్రామంలో తలొక రకంగా అనుకున్నారు.

సత్యమూర్తి తల్లి- లక్ష్మి "భగవంతుడా నన్నెందుకు భూమ్మీద వుంచేవురా" అని కుమిలి కుమిలి ఏడ్చింది కొడుకుల దుస్థితి చూడలేక.

ఉత్తానపాదుడులాగ కొడుకులిద్దర్నీ రెండు తొడలమీద కూర్చుండబెట్టుకొని అతి గారాబంగా పెంచేడు గురుమూర్తి. అతని రెండవ భార్య లక్ష్మి మాత్రం సురుచిలాంటిది కాదు. సీతామహాలక్ష్మి కుశలవుల్ని పెంచినట్టుగా కుడి యెడమల స్తన్యాన్నిచ్చి సత్య నారాయణ్లిద్దర్నీ పెంచింది.

గురుమూర్తి మొదటి భార్య రవణమ్మ స్వయాన లక్ష్మికి అక్కయ్యే. రవణమ్మకి ఎంతకీ సంతానం కలుగలేదు. చెల్లెలు లక్ష్మిని తన భర్తకు కట్టబెట్టింది. లక్ష్మి నీళ్ళాడిన మరుచటి నెలకే రవణమ్మ తాని ప్పుడుట్టి మనిషిని కానని తెలుసుకుంది. అక్క చెల్లెండ్రిద్దరూ ముద్దులమూటగట్టే కొడుకుల్ని కన్నారు. కాని పురిటిరోజులు తీరకముందే అందర్నీ శాశ్వతంగా విడిచి వెళ్ళిపోయింది రవణమ్మ. అక్క రూపాన్ని పుణికి పుచ్చుకోవడమో లేక రక్తాన్ని పంచి యిచ్చి పెంచిన మమకారమో మనకు తెలియదుగాని అక్కకొడుకు నారాయణ రావుమీదనే లక్ష్మికి మక్కువ యెక్కువ.

పిల్లల్ని చూడకుండా ఉండలేని గురుమూర్తి స్కూలు ఫైనలు తరువాత పట్నానికి పై చదువులకని పిల్లల్ని మరి పంపలేదు. ఆ మరుచటేడాదే పెళ్ళిళ్ళు వైభవంగా చేసేసి తన బాధ్యత తీర్చుకున్నాడు.

నాలుగువేలు పెట్టుబడితో మెయిను రోడ్డులో చేనేత వస్త్రాలయం పెట్టేడు నారాయణరావు. పాతిక మగ్గాలచేత నేయిస్తూ నేతగాళ్ళకింత ఉపాధి కలిగించినవాడయ్యేడు. సత్యమూర్తి పొలంపాటు, యింటి పనులతో సతమతమవుతున్నాడు.

నాలుగు సంవత్సరాలు దొర్లిపోయేయి. సత్యమూర్తికిద్దరాడ పిల్లలు కలిగేరు. నారాయణరావుకింకా సంతానం కలుగలేదు. పెద్దకాలపు ముసలాయి గురుమూర్తి కాలం చేసేడు. మనుమరాండ్రకి సంరక్షణ చెయ్యడంలో లోకాన్నే మరిచిపోతున్న లక్ష్మి తోడికోడళ్ళ తగవులను తీర్చడానికి మళ్ళీ యీ లోకంలోకి వచ్చేది.

"హాయిగా తిని కాలుమీద కాలేసుక్కూచోడమేగాని ఆయనకింత సాయం చేద్దామన్న యింగితంకూడా లేకపోతే యింకెందుకూ...." నారాయణరావుమీద పెద్దకోడలు గొణిగేది. ఆ మాటలు చిన్నకోడలికి వినపడాలనే చూసి మరీ అనేది. "ఆఁ బావగారి సంపాదనతోనే బతికేస్తున్నాం! యీయన మరి తెస్తున్నారా యేఁవన్నానా?.... పురుళ్ళూ పిల్లలూ, మందూ మాకులకే ఎక్కడ లేనిదీ హరించుకుపోతూంది కర్పూరంలాగ" అని చిన్నకోడలు రుసరుసలాడేది ఈ రకం పోరాటం తోడికోడళ్ళకి దినచర్యలో ఒక ముఖ్యాంశమయిపోయింది

మరుచటేడాది వేరే కాపురాలు పెట్టుకున్నారు. ఇంటికి మధ్యగా కంపగోడ ఏర్పాటయింది. వీధి అరుగుమాత్రం రెండు ముక్కలు కాకుండా రెండిళ్ళకూ గల గతసంబంధాన్ని తెలుపుతూ వుంది. పెళ్ళిళ్ళు అయాక నారాయణరావు బట్టల కొట్టు పెట్టేడు. ఆరెకరాల వల్లం వుంది. కొట్టు కాకుండా నారాయణరావుకి రెండు వేలు ముట్టజెప్పేరు పెద్దలు. సత్యమూర్తికి భూములు మిగిలేయి. నారాయణరావు మీద ప్రేమనీ, సత్యమూర్తి పిల్లలమీద మమతని వదల్లేక యిద్దరు కొడుకులు దగ్గరగా వుంటానని లక్ష్మి తన నిశ్చయాన్ని తెలియజేసింది.

అయిదు సంవత్సరాలు గడిచేయి. సత్యమూర్తికి మరిద్దరు ఆడపిల్లలు కలిగేరు. ఒక్క "మగ నలుసుని" భగవంతుడిచ్చేడు కాదన్నచింత ఆ ఇలుమగల్ని పీకుస్తోంది.

అటు నూలు ధరలు విపరీతంగా పెరిగిపోయేయి. ఇటు నాజూకైన మిల్లు బట్టలముందు పోటీకి నిలబడలేక చేనేత బట్టల ధరలు పడిపోయేయి. నారాయణరావు నేతగాళ్ళవద్దనుండి డబ్బు రాబట్టుకోలేకపోయేడు. తనూ భార్యా - యిద్దరే అవటంమూలాన అసలే పొదుపరికాని నారాయణరావు డబ్బుని మంచినీళ్ళలా ఖర్చు పెట్టేసేడు - కాఫీలు - టిఫిన్లూ స్నేహితులూ - సిగరెట్లూ, బియ్యమూ - ఖర్చు పెచ్చాలకీ, భార్య మెడలోది నాలుగు తులాల గొలుసునమ్మి సాహుకార్ల బాకీలు తీర్చేసేడు. భార్య పురిటికి డాబా తాకట్టు పెట్టేడు. పిల్లాడు పుట్టిన ఆరు మాసాలకి కొట్టుని తెగనమ్మేసేడు. అన్నయ్య సత్యమూర్తే దాన్ని కొన్నాడు.

నారాయణరావు కొడుకు గురుమూర్తి. తండ్రిపేరు పెట్టేడు. ఏడాది యీడు వాడయ్యేడు. పాకుతూ యిల్లంతా పరిపాలిస్తున్నాడు. నట్టిల్లుదాటి వీధిలోకి అటునుండి పెరట్లోకి పచారు చేస్తున్నాడు. వీధి అరుగు సంగతి చెప్పనక్కర్లేదు- ఈ చివరినుండి ఆ చివరివరకూ ఆ పసివాని సామ్రాజ్యమే!

చిన్నకోడలు పెరటిలో వంట పనిలో ఉంది. లక్ష్మి ఎటో వెళ్ళింది. గురుమూర్తి వీధి అరుగుమీదికి పాక్కుకుంటూ వచ్చేడు. చేతిలోని లక్కకాయను వీధిలోకి విసిరేసి తిరిగి దాన్ని తీసుకోడానికి రోడ్డుమీదికి ఉరకలు పెడుతున్నాడు. రోడ్డు మీద పడిపోయేవాడే- పెద్ద కోడలు చూసింది. "అయ్యో! కొడుకు పడిపోయేడు." నోటిలోని మాటలు నోటిలోనే ఉండిపోయేయి. పరుగెత్తుకు వచ్చి బాబును తీసింది, ఎత్తుకొని ముద్దుపెట్టుకుంది. గురుమూర్తి పాలకోసం తడిమేడు. బాయి బుల్లినోటికి తన రొమ్మునందించింది. అనిర్వచనీయమైన ఆనందానుభూతిని పొందింది.

"మగబిడ్డ నా స్తన్యాన్ని తీసుకుంటున్నాడు" మధురమయిన తలపోత.

పెద్దకోడలికెంత ఆనందం! గురుమూర్తిని తన కొడుకుగానే భావించిందా మాతృమూర్తి. స్తన్యాన్నివ్వడంలో సర్వ ద్వేషాల్ని మరచిపోయింది. నలుగురు

(తరువాయి 21వ పేజీలో)

# పెద్దకోడలు

(12 వ పేజీ తరువాయి)

ఆడపిల్లలకి పాలిచ్చి, పెంచిందిగాని మగ బిడ్డకి పాలివ్వడం యిదే మొదటిసారి. ఈ రకమైన ఆనందం తానిదివరకు పొంద లేదు. ఇన్నాళ్లూ దొరకని నిధి యిప్పుడు దొరికింది. సంతోషంతో కళ్లు మెరిసేయి.

"గురుమూర్తి చిన్నకోడలి కొడుకు" ఈ మాట ఆమె ఊహలోనే లేదిప్పుడు. ఇప్పుడు దొరికిన నిక్షేపంముందు సర్వమూ త్యజించడానికి తను సిద్ధమే. దాన్నిప్పుడు దూరం చేసుకోలేదు ఆప్యాయంగా పుణుకుతూ బాబుని హృదయానికి హత్తుకుంది.

"బాబూ! ఒరే చిట్టినాన్నా!.... అయ్యో వీధిలోకిగాని పోలేదుగదా!" గాబరాగా చిన్నకోడలు కన్నకొడుకుని వెతుక్కుంటూ వీధి గుమ్మంలోకి వస్తున్నది. పెరట్లో వంట పనులు తెమల్లేదు. గురుమూర్తి కనబడక పోవడంతో ఆత్రంగా పరుగెత్తుకు వచ్చింది. చిన్నకోడలు బాబుని పిలవడం విన్న పెద్దకోడలు గతుక్కుమంది. "పిల్లాడ్ని తీసినట్టు చిన్నకోడలికి తెలిస్తే దానిముందు చులకనయిపోనూ!" వదల్లేక వదల్లేక- దించేసింది ముద్దులు మూటగట్టేబాబు గురుమూర్తిని. తను మెల్లగా ఇంట్లోకి జారుకుంది.

ఒక్కసారిగా తననెందుకు దించేసిందో ఆ పసి బాలుని కర్థంకాలేదు. చిన్నబుచ్చుకొని ఏడుపు లంకించుకున్నాడు. ఎదురుగా తన తల్లి కనబడింది. చేతులు చాచి తల్లి దగ్గరికి వచ్చేసేడు. పిల్లాడ్ని దించేసి వెళ్ళిపోతున్న దెవరో చిన్నకోడలు గ్రహించింది. తన కింకా వంట పని పూర్తికాలేదు. ఇంకాంచెం సేపటివరకు ఎవరో ఒకరు గురుమూర్తిని ఆడించడమే ఆమె కిప్పుడు కావలిసింది. ఆ మాట తోడికోడలితో చెప్పడానికి వచ్చినా తనకి మనసు చెల్లదు. అందుకే "ఎవరో ఒకరు బాబుని ఎత్తుకొని ఆడిస్తున్నారులే" అని సరిపుచ్చుకొని చూచీ చూడనట్టు వెను దిరిగి వెళ్ళిపోలేకపోయింది. బాబుని తీసేవారు లేనందున ఎవరో ఒకరు బాబు నెత్తుకోవడమే బాగుండునవిపిస్తుందికూడా! అయినా ఆ భావం బయటకి కనృడనీయ లేదు. "మా పొడ అంత గిట్టనప్పుడు పిల్లాడ్నిమాత్రం ఎందుకు తియ్యాలి?" మాటల్లో చిన్న కరకుదనాన్ని మేళవించి అంది.

"నాకు హక్కులేదూ!.... హుం నా మరిది కొడుకుకాడూ!" తనకూ అధికార ముందని తనలో తనే గొణుక్కుంది పెద్ద కోడలు. మరుక్షణంలోనే మరిదికి తానెటువంటి అపకారం చేసిందీ కళ్ళముందు మెదిలింది. అవమానంతో తల కృంగిపోయినట్టయింది. మరిదికి వెళ్ళవలసిన వాటాలో మోసం చేసింది. అతను దరిద్రంతో బాధపడుతూ కొట్టు నమ్మేస్తుంటే దానిని తామే కొన్నారు. వాళ్ళని దిక్కులేని వాళ్ళనిగా చేసింది. అటువంటి తన కేనా బాబుమీద అధికారముందని అనుకోవడం!

గురుమూర్తికి నాలుగో ఏడు వచ్చింది. పెద్దకోడలికి మగబిడ్డ కలుగుతాడన్న ఆశ ఆశగానే ఉండిపోయింది. ఆమె కలలు ఫలించలేదు. ఆ నలుగురు ఆడపిల్లల తరువాత మరి సంతానమూ లేదు.

గురుమూర్తిమీద పెద్దకోడలికి అమితమయిన మమత ఏర్పడింది గురుమూర్తిని తన చంకకు తీసికొనవిదే ఉండలేక పోతుంది. తాయిలాలు యిస్తుంది. బాబు తింటుంటే ముచ్చటగా చూస్తుంది- మురిసిపోతుంది. "బాబు లేనిదే బతకలేనేమో!" అనుకుంటుంది. బాబు ముందు సర్వాన్నీ మరచిపోతుంది. బాబు ముందు పెద్ద కోడలితో యింకొక ఊహకు చోటులేనే లేదు.

ఆమె మాతృమూర్తి. గురుమూర్తి గారాల బాబు.

బాబు తన కళ్ళనుండి దూరమయితే పెద్దకోడలు బాధపడేది. ఆ భాగ్యం తనకు లేనందుకు కుమిలికుమిలి యేడ్చేది.

"నా బిడ్డే అయితే నా దగ్గరుండడూ! ఆ గీత బొమ్మదేవుడు నా నుదుట్ని రాయ లేదు.... గురుమూర్తి పరాయి పిల్లవాడు. తనకి కానివాడు. చిన్నకోడలెంత అదృష్ట వంతురాలూ! దానికున్నంత అదృష్టం కూడా నాకు లేదు.... నాకూ వున్నారు- ఆడమంద పూ(వులూ అవీ వున్నాయి. దేనికివన్నీ? ఒక్క మగ నలుసుకి నోచుకోలేకపోయేను. ఎంతయినా ఆడపిల్ల పరాయిదే. వంశాన్ని నిలబెట్టే కొడుకేడీ!....

"అనాథత్తయ్యకూడా యిలాగే ఆలోచించిందట వంశాంకురం లేదని. మావ గారికి మళ్ళీ పెళ్ళికూడ చేసింది. ఆవిడ నోములు ఫలించేయి. నా కంత అదృష్టమా!.... వంశాన్ని నిలబెట్టడానికి గురుమూర్తిలేడూ! గురుమూర్తి నాకొడుకు కాడూ! బాబే మాకు వారసుడు ఇంకె వళ్ళు!....

"చిన్నకోడలి కొడుకా మా ఆస్తికి వారసుడు? ఆ కటిక దరిద్రురాలి కొడుకా" పరిపరి విధాల ఆలోచనలతో పెద్దకోడలు పెనగులాడిపోతూ ఉంటుంది గురుమూర్తి గైరుహాజరులో.

గురుమూర్తి ఎదురుగా ఉంటే పెద్దకోడలి హృదయం అమృతంతో తొణికేది. ఆ పరాయి బిడ్డ పరోక్షంలో ఆమె శరీరము ద్వేషంతో ఊగిసలాడేది.

ఆనాడు గురుమూర్తి వీధిలో ఆడుకొంటున్నాడు. కాటుక- బొట్టూ. చక్కగా దువ్విన జుట్టు- యిలా కుందనపు బొమ్మలా వున్నాడు. పండిన పనస పండు తొనలాగ గురుమూర్తి శరీరం ఆ యెండలో మిలమిల్లాడుతుంది. పెద్దకోడలు వీధి గుమ్మాని కానుకొని బాబును చూస్తూ నిలబడింది. ఆమె ముఖమండలము ఉండుండి ఉజ్వలంగా ప్రకాశిస్తుంది, అంతలోనే అరుణ కాంతినికూడా పొందుతుంది. గురుమూర్తిమీద ఒకసారి ప్రేమ యింకొకసారి ద్వేషం వలన వచ్చిన క్రోధం ఆమెలో చోటు చేసుకుంటున్నవి.

పొర్లుకి వచ్చిన గేదె "వాఁయ్" అని అరుస్తూ నాలుగు కాళ్ళూ చాచి పరుగెత్తు

కొస్తూంది. గురుమూర్తి అట సందడిలో ఉన్నాడు. గేదె అరుపు పెద్దకోడల్ని మామూలు ప్రపంచంలోకి తీసికొచ్చింది. "అయ్యో! బాబు చచ్చిపోయాప్...." పరుగెత్తి బాబుని తీద్దామని ఉరికింది. ముందుకు వేసిన అడుగుతో అక్కడే ఆగిపోయింది- సడన్ బ్రేకుతో ఆగిన చిన్న కారులాగ. ఎటువంటి శక్తి ఆమెలో ప్రవేశించిందోగాని పాదాన్ని ముందుకు పడ నివ్వలేదు!

"పాపపీ.... నాకులేని అదృష్టం దక్కించుకున్న ఆ చిన్న కోడలికి కలగడమా!" ముఖాన్ని ప్రక్కకి త్రిప్పి యింట్లోకి వెళ్ళిపోవాలని కోరిక దిపింది.

"పెద్దమ్మా!"

గావుకేక పెద్దకోడలి కర్ణాలకి తాకి హృదయంలోకి చొచ్చుకుపోయింది. నిరాశా నిస్పృహలతో నిండిన కేక. కొండల్నికూడా మంచులా కరగించే ఆర్త నాదం.

గేదె గురుమూర్తి దగ్గరికి వచ్చేసింది. అప్పుడు చూచేడు ఎటు పారిపోడానికీ పాలుపోలేదు. నిలబడే ఉండిపోయేడు. "అమ్మా! అమ్మా!" అని పిలిచే.. పెద్దకోడలు ఎదురుగా కనిపించింది. "పెద్దమ్మా!" అని పిలిచేడు.

"బాబూ!" పెద్దకోడలు బాబు కెదురుగా పరుగెత్తింది అందుకో లేకపోయింది బాబుని- తన పంచాంకురాన్ని గేదె బారి నుండి తప్పించలేకపోయింది. బాబు తల నుండి రక్తం చిమ్ముతుంది. చూచింది. గుండెలు బాదుకొంది. బాబుని ఒడిలోకి తీసుకొని గాయాన్ని గట్టిగా పట్టుకొంది నెత్తి- నోరూ కొట్టుకొని ఏడుస్తూంది. కొట్టుమీద కూర్చున్న సత్యమూర్తికి సంగతి తెలిసింది. డాక్టరుగారిని తీసికొని వస్తున్నాడు. నారాయణరావు ఊళ్ళోలేడు సంతకు వెళ్ళేడు.

గేదె తన కొమ్ములతో బాబుని దూరంగా విసిరేసింది. దగ్గరున్న తాటిమీదపడ్డాడు. గేదె కొమ్ములు గుచ్చుకోకపోయినా తాటిమీదపడిన కారణంగా రక్తం కారుతుంది. డాక్టరుగారువచ్చి కట్టు కట్టేరు. మరేం ఫర్వాలేదన్నారు.

"నిన్ను నేనే చంపేసురా బాబూ! నాకా పాపబుద్ధి పుట్టకపోతే నీకీ ప్రమాదం రాకపోనురా తండ్రీ!" పెద్దకోడలు మొత్తుకుంటూ ఏడుస్తూంది.

"నా బాబు నా దగ్గరే ఉంటాడు. బాబుని వదిలి నేనుండలేను. బాబు దగ్గరే వుంటాను" గురుమూర్తిని తీసికొని మరిది గారింట్లోకి వెళ్ళింది పెద్దకోడలు. బాబుని మంచంమీదవేసి బాబు ప్రక్కనే కూర్చుంది చిన్నకోడలి చేతులు పట్టుకొని బోరున యేడ్చింది. ఆమెలోని మలినం పోయింది. హృదయం నిర్మలమయింది.

నారాయణరావు వచ్చేడు. అన్నని వదిన్ని తన యింట్లో ఉండడం చూసి ఆశ్చర్యంతోబాటు సంతోషించేడు కూడ బాబు పరిస్థితికి విచారించేడు. అన్నదమ్ము లిద్దరు కన్ను దమ్ములనుండి జలజలా సంతోష బాష్పాలుదాలగా కౌగలించుకొన్నారు.

"కలకాలం వీళ్ళ నిలాగే కనికరించు తండ్రీ!" లక్ష్మి సూర్యనారాయణమూర్తికి చేతులెత్తి మొక్కింది.

'ఎంతయినా వాళ్ళొక తండ్రి పిల్లలు!' ఇరుగు పొరుగు అమ్మలక్కలు కళ్ళని ఒత్తుకున్నారు.

—:O:—

## విధి

కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు

శ్రావణ మేఘం రాల్చిన
జలకణాలు రెండు....
శుక్తి గర్భమున పడినది మౌక్తికమై రహించింది-
మట్టి గుంటలో పడినది మాలిన్యం వహించింది-
భూషించే రొక దానిని.... ద్వేషించే రొక దానిని....
శ్రావణ మేఘం రాల్చిన
జలకణాలు రెండు....

ఒక సుందర విభాతాన
వికసించిన విరులు రెండు....
పరమేశుని పదసన్నిధిని ప్రాప్తించిన దొక్కవిరికి-
చితికి ధూళిలో నశించు గతి పట్టిన దొక్క విరికి-
పరమ పూజ్యమైన దొకటి.... పరిత్యాజ్యమైన దొకటి....
ఒక సుందర విభాతాన
వికసించిన విరులు రెండు....

చిన్ననాటి మరపురాని
స్నేహితులున్నారిద్దరు....
విరబూసిన వెల్గులలో చిరునవ్వులు వెదజల్లును
నిండిన మధుపాత్రికతో నింగి కెగసిపోయె నొకడు-
ఒకడు మిగిలిపోయె కటిక చీకటిలో అశ్రులతో
పగిలిన జీవన పాత్రిక పలుకులు ఆతికించలేక-
భూషించే రొక మిత్రుని.... దూషించే రొక మిత్రుని
చిన్ననాటి మరపురాని
స్నేహితులున్నా రిద్దరు....

("సాహిర్ లుధియానవి" ఉర్దూ గీతానికి భావానువరణ)